ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పోర్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 137 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 23 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalligudem, Kadapa, Ongole

# ఏడాదిన్నరలో 10 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం :ప్రధాని మోదీ

తమ ప్రభుత్వ పాలనలో ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**ఢిల్లీ, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలిచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు.



దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుందని అన్నారు.ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారని.. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి యువత పైనే ఆధారపడి ఉంటుందని.. అయితే గత ప్రభుత్వాలు వారికి సరైన ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశం వెనకబడిపోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. అందుకనుగుణంగా మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ అన్నిరంగాల్లో ముందుకువెళ్తుందని.. అంతరిక్షం, రక్షణ, మొబైల్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, పర్యటక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని

## కలిసే యోచనలో తెలుగు సినీ ప్రముఖులు

సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ఆలోచనలో తెలుగు సినీ ప్రముఖులు ఉన్నారు.



**హైదరాబాద్, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ఆలోచనలో తెలుగు సినీ ప్రముఖులు ఉన్నారు. ఈ మేరకు నిర్మాత నాగవంశీ తెలిపారు. అమెరికాలో ఉన్న నిర్మాత, ఎఫ్‌ఎసీ చైర్మన్ దిల్ రాజు హైదరాబాద్కు తిరిగి వచ్చాక సీఎంను కలుస్తామని చెప్పారు. టికెట్ ధరల పెంపు, ప్రీమియర్ షోలపై చర్చిస్తామని నాగవంశీ తెలిపారు.

## పెళ్లి కాక ముందే బేబీ బంప్తో ఫొటోషూట్ .. చైనాలో కొత్త ట్రెండ్

చైనాలోని చాలామంది యువతులు ఓ కొత్త ట్రెండ్ను ఫాలో అవుతున్నట్లుగా పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.



**డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** అమ్మయ్యే క్రమంలో ప్రతి క్షణం ప్రత్యేకమే! అందుకే కొన్ని అపురూప క్షణాల్ని వేడుకగా జరుపుకొంటూ పది కాలాల పాటు మిగిలిపోయే జ్ఞాపకాలుగా మా-ర్చుకోవాలని ప్రతి మహిళా కోరుకుంటుంది. అందుకనుగుణంగా ఉన్న ట్రెండ్ను చాలామంది మహిళలు ఫాలో అవుతున్నారు. గర్భం దాల్చాక బేబీ బంప్ తో ఫొటోలు తీసుకొని సంబరపడుతున్నారు. కానీ వీరికి భిన్నంగా చైనా యువతులు మాత్రం పెళ్లికి ముందే బేబీ బంప్ తో ఫొటోషూట్ చేసుకుంటున్నారట! చైనాలో వచ్చిన కొత్త ట్రెండ్ను అనుసరించి చాలామంది యు-వతులు పెళ్లి కాకముందే బేబీ బంప్స్ తో ఫొటోషూట్ లు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ (%వాజవీూ%) నివేదికలు తాజాగా వెల్లడించాయి. గర్భధారణ సమయంలో ఒళ్లు చేయడం, పలు ఆరోగ్య సమస్యల వల్ల ఫొటోషూట్ సరిగా కుదరదని వారు భావించడమే దీనికి కారణమట. అందువల్ల నాజూకైన శరీరం ఉండగానే ఫేక్ బెల్లీ (గర్భం ధరించినట్లుగా ఉండే కాస్ట్యూమ్)తో అక్కడి యువతులు ఫొటోషూట్లు తీయించుకుంటున్నారని నివేదికలు పేర్కొన్నాయి.చైనాకు చెందిన మెయిజీ గీజ్ అనే యువతి తన ఫేక్ బేబీబంప్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ గా మారాయి. నేను స్లిమ్గా ఉన్నప్పుడే బేబీ బంప్తో ఫొటోషూట్ చేసి.. గర్భధారణ సమయంలో పొందే ఆనందాన్ని అనుభవించాను" అంటూ ఆమె రాసుకొచ్చింది. పలువురు యువతులు సైతం వారి ఫొటోలను పంచుకున్నారు. అయితే, ఈ ట్రెండ్ను నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తాము కూడా 70 ఏళ్ల పుట్టినరోజు, అంత్యక్రియల ఫొటోషూట్లు నిర్వహించుకొంటామంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

## పేర్ని నానీ.. తప్పు చేయకపోతే తప్పించుకుని తిరగడం దేనికి?: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి: వైకాపానేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం రేషన్ బియ్యం కుంభకోణంపై విచారణకు సిట్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తానని మంత్రి కొల్లు రవీంద్రతెలిపారు.



**అమరావతి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం రేషన్ బియ్యం కుంభకోణంపై విచారణకు సిట్ ఏర్పాటు చేసేందుకు సిఫార్సు చేస్తానని మంత్రి కొల్లు రవీంద్రతెలిపారు. పేర్ని నాని పేదల బియ్యం మాయం చేసింది వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. తన గోదాములో బియ్యం నిల్వలు తగ్గాయని స్వయంగా ఆయన ఒప్పుకున్నారని చెప్పారు. తప్పు చేయనపుడు దొంగలా తప్పించుకొని తిరగడం ఎందుకని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కేసు విచారణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రోడ్డు పనులు పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్

కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ పర్యటించారు.



**కంకిపాడు, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ పర్యటించారు. గుడువర్రు గ్రామంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు పనులు జరుగుతున్న చోట గొయ్యి తీయించి నాణ్యతను పవన్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు.

## ముంబయి ఫెర్రీ ప్రమాదం

### .. ఆ సమస్య నేవీ సిబ్బందికి ముందే తెలుసు..!

ముంబయి ఫెర్రీ ప్రమాదంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. గతవారం పర్యటకుల ఫెర్రీని నౌకాదళ పడవ ఢీకొన్న సంగతి తెలిసిందే.



**ముంబయి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** అరేబియా సముద్ర జలాల్లో ఇటీవల పర్యటకులు ఫెర్రీని నౌకాదళానికి చెందిన ఓ స్పీడ్ బోటు ఢీకొట్టిన ఘటనలో 15 మంది మృతి చెందారు. దీనికి సంబంధించి కీలక విషయాలు వెల్లడయ్యాయి. స్టీరింగ్లో సాంకేతికలోపం తలెత్తడం, వేగాన్ని నియంత్రించే థ్రోటల్ క్వాడ్రంట్ కూడా సరిగా పని చేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమంటూ నౌకాదళ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఈ లోపాల గురించి క్రూ సిబ్బందికి ముందే అవగాహన ఉందని సమాచారం.గత వారం ముంబయి తీరం సమీపంలోని ప్రసిద్ధ ఎలిఫెంటా దీవిని సందర్శించేందుకు వెళ్తున్న పర్యటకుల ఫెర్రీని ఇంజిన్ ట్రయల్స్ భాగంగా అతివేగంతో వెళ్లిన బోట్ ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. అప్పుడు ఫెర్రీలో 113 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 98 మందిని రక్షించారు. నిబంధనల ప్రకారం.. అందులో 84 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది మాత్రమే ఎక్కాల్సిఉంది. ఈ ఘటనపై మహారాష్ట్ర మారిటైమ్ బోర్డ్ దర్యాప్తు చేపడుతోంది. ఫెర్రీ లైసెన్స్ రద్దు చేసింది. అలాగే కొలాబా పోలీస్ స్టేషన్ పరిధిలో నేవీ బోట్ డ్రైవర్పై కేసు నమోదైంది.

## అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం

రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.



**అమరావతి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 12 నాటికి 1.18 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 44వ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎల్పీఎస్ జోన్ 7, జోన్ 10లో మౌలిక వసతుల కల్పనకు నిర్ణయం తీసుకున్నారు. రాజధాని ఔటర్ రింగ్ రోడ్డు, విజయవాడ బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఇప్పటి వరకు రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.

## ఎన్టీఆర్ అభిమానికి అనారోగ్యం.. అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ

తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న తెదేపా కార్యకర్త, ఎన్టీఆర్ అభిమాని అయిన మల్లికార్జునరెడ్డికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు.



**అమరావతి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న తెదేపా కార్యకర్త, ఎన్టీఆర్ అభిమాని అయిన మల్లికార్జున రెడ్డికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. నెల్లూరు పట్టణానికి చెందిన కె. మల్లికార్జునరెడ్డి.. నారా లోకేశ్ సేవాసమితి పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలిచారు. ఎన్టీఆర్ అభిమాని అయిన మల్లికార్జున రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఉన్నారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఏడాదిక్రితం పక్షవాతం రావడంతో పరిస్థితి విషమించింది. చికిత్స తీసుకుని కోలుకున్నారు. నెల క్రితం ఆయనకు మళ్లీ పక్షవాతం రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందించిన వైద్యులు..ఇన్ఫెక్షన్ కారణంగా ఒక కాలును తొలగించారు. పక్షవాతం కారణంగా మరో కాలుతో నడవలేని పరిస్థితి. దీంతో మల్లికార్జునరెడ్డి దుస్థితిని పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.పార్టీ అన్నివిధాల అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి సూచనలతో పురపాలక శాఖ మంత్రి నారాయణ వీడియో కాల్ ద్వారా మల్లికార్జునరెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని, త్వరలో స్వయంగా వచ్చి కలుస్తానని భరోసా ఇచ్చారు.సాయం కోరిన వెంటనే స్పందించిన మంత్రి లోకేశు మల్లికార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# విజయసాయి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదు:సోమిరెడ్డి

విజయసాయి రెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**అమరావతి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్కోకు విజయసాయి అనుబంధ సంస్థ బొగ్గు అమ్మిందని ఆరోపించారు. 4.5 లక్షల టన్నుల నాసిరకం బొగ్గును.. టన్ను రూ.8,500లకు విక్రయించిందన్నారు. అధిక ధరకు కొని ప్రజలపై విద్యుత్ భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.విజయసాయి వియ్యంకుడికి ఆదాయం కోసం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు వేశారన్నారు. ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ నాసిరకం బొగ్గు సరఫరాపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని.. దీనిపై సీఐడీ, విజిలెన్స్ ఎందుకు చర్యలకు ఉపక్రమించట్లేదని ప్రశ్నించారు. విజయసాయి దొంగల ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ కుంభకోణాలపై చర్యలకు వివిధ శాఖల్లో సిబ్బంది కూడా సరిపోవట్లేదని వ్యాఖ్యానించారు. 108, 104 స్కామ్ పైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సోమిరెడ్డి కోరారు

# క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీతో క్రైమ్ రేట్ తగ్గించాం : రాచకొండ సీపీ

విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీరాబాబు తెలిపారు.



**హైదరాబాద్, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. 2024లో మొత్తం 33,084 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కమిషనరేట్ పరిధి నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు."ఈ ఏడాది నమోదైన 33,084 కేసుల్లో 25,143 కేసులు పరిష్కరించాం. 3 షిఫ్టుల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాం. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక కేసులను పరిష్కరించిన కమిషనరేట్గా రాచకొండ నిలిచింది. మా పరిధిలో నమోదైన కేసుల్లో 30 మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. అందులోనూ అగ్రస్థానంలో నిలిచాం. సంచలనం సృష్టించిన మోటకొండూరు పీఎస్ పరిధిలో 14 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. వివిధ కేసుల్లో 160 మందికి శిక్ష ఖరారైంది.లోక్ అదాలత్లో 11,440 కేసులతో పాటు 70,791 పెట్టీ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది డయల్ 100 ద్వారా 2,41,742 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని విభాగాల్లో కలిపితే క్రైమ్ రేటు 4% మాత్రమే పెరిగింది. గతేడాదితో పోలిస్తే హత్యకేసుల్లో ఎలాంటి మార్పు లేదు. చోరీ కేసులు 6%, డొమెస్టిక్ వయిలెన్స్ కేసులు 23% తగ్గాయి. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్ను సీజ్ చేశాం. మొత్తం 521 మంది డ్రగ్ నేరస్థులను అరెస్ట్ చేశాం. ఆ నిందితులపై 165 రౌడీషీట్లు ఓపెన్ చేశాం. ఎన్నికల సందర్భంగా రూ.16 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశాం. సైబర్ బాధితులకు రూ.22 కోట్లు రిఫండ్ అయ్యేలా చర్యలు చేపట్టాం.కమిషనరేట్ పరిధిలో హద్దు దాటే బౌన్సర్లపై తీవ్ర చర్యలు ఉంటాయి. భయానక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేసి దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయి. సినీనటుడు మోహన్ బాబు కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఇది కోర్టు పరిధిలో ఉంది. హైకోర్టు ఆయనకు ఈనెల 24 వరకు గడువు ఇచ్చింది. ఆ తర్వాత నోటీసులు ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే ప్రభుత్వం మాది : మంత్రి నిమ్మల


రైతులకు మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మే ప్రభుత్వం తమదని అన్నారు.



**అమరావతి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** రైతులకు మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మే ప్రభుత్వం తమదన్నారు. వైకాపాఅధినేత జగన్ రైతుల పొలం గట్ల మీద సర్వే రాళ్లపై తన బొమ్మలు వేయించుకోవడానికి రూ.700 కోట్లు వృథా చేశారని ధ్వజమెత్తారు. రైతులకు భూములపై హక్కులు లేకుండా, పట్టాదారు పాసుపుస్తకాలపై వారి ఫొటోలు లేకుండా జగన్.. తన బొమ్మ వేయించుకున్నారని దుయ్యబట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి రైతుల ఆస్తులు దోచుకోవాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి, భూముల రక్షణకు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకొచ్చామని వెల్లడించారు.అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి రాయితీ హెక్టారుకు రూ.25 వేలకు పెంచి అందిస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. వైకాపా ప్రభుత్వం రైతులకు పెండింగ్ పెట్టిన ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. సాగునీటి రంగంలో భాగస్వామ్యం కల్పించేలా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించామన్నారు. గత అయిదేళ్లు రైతు వ్యతిరేక పాలనతో విసుగుచెందిన రైతులు.. సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఏకగ్రీవ విజయాన్ని కట్టబెట్టారని స్పష్టంచేశారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకునేలా 60వేల మంది రైతులకు సాగునీటి రంగంలో ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు.

# ప్రకాశం జిల్లాలో వరుసగా మూడోరోజు భూప్రకంపనలు

ప్రకాశం జిల్లాలో వరుసగా మూడోరోజు స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి.



**ముండ్లమూరు, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** ప్రకాశం జిల్లాలో వరుసగా మూడోరోజు స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి. ముండ్లమూరు, సింగనపాలెం, శంకరాపురం, మారెళ్ల పరిసర ప్రాంతాల్లో సోమవారం భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గత రెండు రోజులుగా ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోని గ్రామాల్లో స్వల్పంగా భూప్రకంపనలు

# తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం ..జనవరి 5న టోకెన్ల జారీ

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం వచ్చే తిరుపతి స్థానికులకు వచ్చే ఏడాది జనవరి 5న స్థానిక దర్శన కోటా టోకెన్లను జారీ చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది.



**తిరుమల,డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం వచ్చే తిరుపతి స్థానికులకు వచ్చే ఏడాది జనవరి 5న స్థానిక దర్శన కోటా టోకెన్లను జారీ చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. తితిదే బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జనవరి 7న మొదటి మంగళవారం తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు జనవరి 5న (ఆదివారం) తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీ నగర్ లోని కమ్యూనిటీ హాల్లో దర్శన టోకెన్లు జారీ చేయన్నట్లు తెలిపింది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవలసి ఉంటుందని తితిదే పేర్కొంది.

# మహిళను అవమానిస్తే మీ నాయకుడు సంతోషిస్తారా? : మేయర్ ను నిలదీసిన ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన స్థానిక తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వేదికపై కుర్చీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



**కడప, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన స్థానిక తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వేదికపై కుర్చీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాగే చేశారంటూ మండిపడ్డారు.ఈ సందర్భంగా మాధవీరెడ్డి మాట్లాడుతూ వైకాపాకు చెందిన మేయర్ సురేశ్ బాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మహిళను మేయర్ అవమానపరుస్తున్నారు. మహిళను అవమానిస్తే మీ నాయకుడు సంతోషిస్తారేమో. తన కుర్చీని లాగేస్తారని మేయర్ భయపడుతున్నట్లున్నారు. అందుకే ఆయన కుర్చీలాట ఆడుతున్నారు. విచక్షణాధికారం ఉందని మేయర్ విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఆయనకు మహిళలంటే చిన్నచూపు. అందుకే మహిళలను నిలబెట్టారు. వైకాపా పాలనలో కుడి, ఎడమ వైపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేలకు కుర్చీ వేయకపోవడంలో ఆంతర్యమేంటి? కడప అభివృద్ధిని కుంటుపరిచారు. ఇక్కడ జరిగిన అవినీతిపై మాట్లాడాలి. అవినీతిపై చర్చిస్తారనే సమావేశాలు జరగకుండా చేస్తున్నారు" అని మాధవీరెడ్డి విమర్శించారు.ఈ క్రమంలో మేయర్ సురేశ్ బాబు, ఎమ్మెల్యే మాధవీరెకి మధ్య వాదోపవాదాలు సాగాయి. కుర్చీ లేకపోవడంతో ఎమ్మెల్యే నిలబడే ఉన్నారు. మేయర్ కుర్చీకి ఒక వైపు తెదేపా, మరో వైపు వైకాపా కార్పొరేటర్లు నిల్చొని నిరసన తెలిపారు. మేయర్ కుర్చీ వెనక ఇరుపక్షాల వాదోపవాదనలు సాగాయి. పోటాపోటీ నినాదాలతో సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. తెదేపా, వైకాపా కార్పొరేటర్ల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మేయర్కు క్షమాపణ చెప్పాలంటూ వైకాపా కార్పొరేటర్లు కింద బైఠాయించి నిరసన తెలిపారు.సమావేశానికి ఆటంకం కలిగిస్తున్నారంటూ వైకాపా నుంచి తెదేపాలోకి వెళ్లిన ఏడుగురు కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ సురేశ్ బాబు ప్రకటించారు. వైకాపా కార్పొరేటర్లను కూడా సస్పెండ్ చేయాలని తెదేపా సభ్యులు డిమాండ్ చేశారు.మరోవైపు ఎమ్మెల్యేకు కుర్చీ ఇవ్వకపోవడంతో నగరపాలక సంస్థ కార్యాలయం బయట ఆమె వెంట వచ్చిన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మేయర్ డౌన్డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహిళను గౌరవించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు.

# పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.



**హైదరాబాద్, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్లో రోజ్ గార్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నేడు నియామక పత్రాలు అందజేస-్తున్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని ద్యోగార్థులకు సూచించారు.అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే మా ఆకాంక్ష: బండి సంజయ్

అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే తమ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హకీంపేట్లోని నిసా కేంద్రంలో నిర్వహించిన రోజ్ గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 340 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 8.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# తీరానికి సమీపంలో అల్పపీడనం .. ఆకాశం మేఘావృతం

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి తీరానికి సమీపంలోనే ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.



**విశాఖపట్నం, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి తీరానికి సమీపంలోనే ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. తీరం వద్దే ఉండటం వల్ల ఆకాశం మేఘావృతమై ఉన్నట్లు తెలిపింది. మరో రెండు రోజులపాటు ఇదే వాతావరణం కొనసాగుతుందని, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. విశాఖ పోర్టులో మూడో నెంబర్ సాధారణ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. అల్పపీడన ప్రభావంతో సోమవారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 16న అల్పపీడనం ఏర్పడింది. తర్వాత వాయుగుండంగా బలపడి, తమిళనాడు తీరానికి దగ్గరగా వెళ్లొచ్చని నిపుణులు భావించారు. తర్వాత రెండు రోజులకు తీవ్ర అల్పపీడనంగా బలపడి ఏపీ తీరం వైపు వచ్చింది. మరో రెండు రోజులకు వాయుగుండంగా మారింది. శనివారం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. దాదాపు వారం రోజులుగా అల్పపీడనం ప్రయాణం సాగిస్తోంది. ఉత్తర భారతం నుంచి వీచే పశ్చిమ గాలుల ప్రభావంతో వాయుగుండం ఉత్తర కోస్తా (ఏపీ) తీరం వెంబడి ప్రయాణించిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వాటి ప్రభావం తగ్గడంతో మళ్లీ దిశ మార్చుకుందని అంటున్నారు. దీని ప్రభావంతో దాదాపు అయిదు రోజులుగా మత్స్యకారుల పడవలు ఒడ్డుకే పరిమితమయ్యాయి.

# వైకాపా నేతలకు ఇంకా అమరావతిపై కక్ష తీరలేదు : మంత్రి నారాయణ

26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



**అమరావతి,డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని 26 జిల్లాలనూ సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రానికి, దేశానికైనా రాజధాని అవసరమన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో పాటు అన్ని ప్రాంతాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. రుణాలు తీసుకొచ్చామని.. వాటి భారం ప్రజలపై మోపేది లేదని స్పష్టం చేశారు. భూముల విలువ పెరిగాక రుణాలు తిరిగి చెల్లిస్తామన్నారు. ప్రజలపై భారం లేకుండా పనులు సాగుతాయని చెప్పారు."గతంలో మేం తీసుకొచ్చిన పరిశ్రమలను వైకాపా ప్రభుత్వం తరిమేసింది. మళ్లీ పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. జనవరి 15 కల్లా రాజధాని నిర్మాణ పనుల టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. కట్టని ఇళ్లకు గత ప్రభుత్వం రుణం తీసుకొని అనేక సమస్యలు తెచ్చింది. బ్యాంకులకు రూ.102 కోట్లు చెల్లిస్తే గానీ ముందుకు కదలని పరిస్థితి. ఆ నిధుల విడుదలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. భూముల అమ్మకం, సంపద సృష్టితోనే రుణాలు చెల్లిస్తాం. వైకాపా నేతలకు ఇంకా అమరావతి రాజధానిపై కక్ష తీరలేదు. అందుకే ఆ పార్టీ విష ప్రచారం చేస్తోంది" అని నారాయణ విమర్శించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1841:** కలకత్తాలోని హిందూ కళాశాల నియమిత అధ్యాపకుడు, పండితుడు, కవి హెన్రీ డెరోజియో మరణం. (జ.1809)
- **1902:** భారతదేశ ఐదవ ప్రధానమంత్రి చరణ్ సింగ్ జననం. (మ.1987) (చిత్రంలో)
- **1926:** భారత విద్యావేత్త స్వామి శ్రద్ధానంద మరణం.
- **1933:** కవి, సంపాదకుడు శిరోమణి సహవాసి జననం.
- **1987:** వీణ విద్వాంసుడు ఈమని శంకరశాస్త్రి మరణం. (జ.1922)
- **1997:** పండితులు గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి మరణం. (జ.1913)
- **1998:** లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కు మరణానంతరం భారతరత్న పురస్కారం లభించింది.
- **2004:** భారతదేశ 9వ ప్రధానమంత్రి పాములపర్తి వెంకట నరసింహారావు మరణం. (జ.1921)


హెన్రీ డెరోజియో



చరణ్ సింగ్



స్వామి శ్రద్ధానంద


ఈమని శంకరశాస్త్రి


లక్ష్మీనరసింహ శాస్త్రి



భారతరత్న


వెంకట నరసింహారావు

రిపబ్లిక్ స్పోర్ట్స్

# సంజూ శాంసన్ త్యాగం

## .. వచ్చే ఐపీఎల్ లో మారనున్న అతడి ! రోల్

**వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం సంజూ శాంసన్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నాడు.**



వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం కెప్టెన్ సంజూశాంసన్ ను రాజస్థాన్ రాయల్స్ రూ.18 కోట్లకు అట్టి పెట్టుకున్న విషయం తెలిసిందే. వికెట్ కీపర్ బ్యాటర్ అయిన సంజూ ఈనేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకున్నాడు. వికెట్ కీపింగ్ బాధ్యతలను అతడు త్యాగం చేయనున్నాడు. ఇన్నాళ్లు ఆ బాధ్యతలను నిర్వర్తించిన సంజూ.. ఇక మీదట యువ ఆటగాడు ధ్రువ్ జురెల్ కు వాటిని అప్పగించేందుకు సిద్ధమవుతున్నాడు. బ్యాటింగ్ తోపాటు సారథ్య బాధ్యతలపైనే పూర్తిగా దృష్టి సారించేందుకు అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఇదే విషయమై ధ్రువ్ జురెల్తో చర్చించానని సంజూ తెలిపాడు. ముఖ్యంగా టీమ్ ఇండియా రెండో చాయిస్ టెస్టు వికెట్ కీపర్గా అతడు ఎదిగిన తర్వాత.. వికెట్ల వెనక బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు శాంసన్ వెల్లడించాడు. అయితే.. తామిద్దరమూ వికెట్ కీపింగ్ బాధ్యతలను పంచుకునే అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించాడు.”నేను ఈ విషయాన్ని బయటకు చెప్పలేదు. కానీ, టెస్టు వికెట్ కీపర్గా ధ్రువ్ జురెల్ రాణించాడు. ఐపీఎల్ లో కూడా ఆ బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది చర్చించే అంశమే. మేమిద్దరమూ గ్లోవ్స్ షేర్ చేసుకుంటామని అనుకుంటున్నాను. ఇప్పటివరకూ ఫీల్డర్గా ఉంటూ కెప్టెన్గా బాధ్యతలు నిర్వర్తించలేదు. అయితే.. అది నాకో సవాల్. దీని గురించి ధ్రువ్ జురెలు చెప్పాను. జట్టు సారథిగా నేను నా బాధ్యతలు నిర్వర్తించాలి. మరోవైపు టీమ్కే తొలి ప్రాధాన్యం. జట్టు అగ్రస్థానంలో ఉండాలి. అదే సమయంలో ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి” అని సంజూ ఓ యూట్యూబ్ చానల్ తో మాట్లాడుతూ వివరించాడు.ఇక జురెల్ ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. అయితే.. రిషబ్ పంత్ పూర్తి ఫిట్నెస్ జట్టులోకి పునరాగమనం చేయడంతో జురెల్ వికెట్ కీపర్ బాధ్యతలు కోల్పోవాల్సి వచ్చింది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని పెర్త్ టెస్టులో వీరిద్దరూ ఆడినప్పటికీ.. అడిలైడ్, బ్రిస్బేన్ టెస్టుల్లో జురెల్ బెంచ్కే పరిమితమయ్యాడు.ఇక రాజస్థాన్ రాయల్స్ సంజూ శాంసన్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, హెట్మైర్, సందీప్ శర్మలను అట్టిపెట్టుకున్న విషయం తెలిసిందే.

రిపబ్లిక్ సినిమా CINEMA

# పోల్ : 2024లో ఈ ఏడాది మిమ్మల్ని ఆకట్టుకున్న కొత్త కథానాయిక ఎవరు?

**ఈ ఏడాది మిమ్మల్ని ఆకట్టుకున్న కొత్త హీరోయిన్ ఎవరో పోల్ లో మీ ఓటు వేసి చెప్పండి.**

ఈ ఏడాదిలో చాలామంది కొత్త కథానాయికలు టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. కొందరు నటనకు కొత్త కాగా, మరికొందరు టాలీవుడికి కొత్త. ఇలా వచ్చినవారిలో కొంతమంది విజయం అందుకుని అలరించగా, మరికొంతమంది నిరాశపరిచారు.
మరి మిమ్మల్ని ఏ హీరోయిన్



# 'పాతాళ్ లోక్' సీజన్ 2 వచ్చేస్తోంది .. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

**పాతాళ్ లోక్ సీజన్2 స్ట్రీమింగ్కు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.**

క్లీన్ స్లేట్ ఫిల్మ్స్ పతాకంపై వచ్చిన 'పాతాళ్ లోక్' వెబ్ సిరీస్ భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. 2020లో క్రైమ్ థ్రిల్లర్గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సిరీస్ విమర్శకుల ప్రశంసలు అందుకుంది. దీంతో రెండో సీజన్ న్నుతెరకెక్కించారు. తాజాగా దాని రిలీజ్ డేట్ను ప్రకటించారు. ప్రముఖ ఓటీటీ వేదికగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. జనవరి 17వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నట్లు సంస్థ తెలిపింది. ఈమేరకు ఓ పోస్టర్ విడుదల చేసింది.అనుష్క శర్మ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. కచ్చితంగా చూడాల్సిన సిరీస్ అంటూ ఎంతోమంది ప్రముఖులు దీనిపై పోస్టు పెట్టారు. ఇందులో ఓ కేసును దర్యాప్తు చేసే పోలీసు అధికారి హాథీరామ్ చౌదరీ పాత్రకు మంచి పేరొచ్చింది. వ్యవస్థలోని లోపాలను, సమాజంలోని వివక్షను కళ్లకు కట్టినట్లు చూపించిందీ వెబ్ సిరీస్. హాథీరామ్ చౌదరీగా నటించిన జయదీప్ అహ్లావత్ ప్రేక్షకుల మన్ననలు పొందారు. దీనికన్నా ముందే రాక్స్టార్, విశ్వరూపం, గబ్బర్ లాంటి పలు చిత్రాల్లో నటించారు. పాతాళ్ లోక్లో విశాల్ త్యాగి, తోప్ సింగ్ పాత్రలకూ మంచి ఆదరణ లభించింది.




# 'డాకు మహారాజ్.. మూడు భారీ ఈవెంట్లు చేస్తాం: నాగవంశీ

**బాలకృష్ణ హీరోగా బాబీ తెరకెక్కిస్తోన్న సినిమా 'డాకు మహారాజ్.**

**తాజాగా ఈ చిత్రబృందం ప్రెస్మీట్ నిర్వహించింది.**

డాకు మహారాజ్' తో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు. నందమూరి బాలకృష్ణ ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బాబీ తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా నుంచి రెండో పాట డిసెంబర్ 24న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. ఆ విశేషాలివి..నాగవంశీ: ఎఫ్ఎసీ ఛైర్మన్ దిల్రాజు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆయన హైదరాబాద్ వచ్చాక అందరం చర్చించుకొని దీనిపై నిర్ణయం తీసుకుంటాం.నాగవంశీ: ఆయనతో వర్క్



చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. ఈ సినిమాలో ఆయన్ని చాలా కొత్తగా చూస్తారు. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ ఇలాంటి లుక్ లో ఆయన కనిపించలేదు. అఖండ, లెజెండ్ గురించి ఎలా చెప్పుకుంటున్నారో దీని గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. సినిమా ఇంటర్వెల్లోనే నాకు ఫోన్ చేసి ఈ మాట చెబుతారు.

## ఆరోగ్యం

# బరువు తగ్గేందుకు చపాతీలు తింటున్నారా ..ఇలా చేసి తింటే క్యాన్సర్స్ గుండెసమస్యలు కూడా దూరం




చపాతీలు తినేవారు చాలా మంది బరువు తగ్గించుకునేందుకు తింటారు. దీనికోసం ఎక్కువగా గోధుమపిండితో చపాతీలు చేస్తారు. సాధారణంగా కార్బ్స్ ఎక్కువగా ఉండే గోధుమపిండి తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారని చెబుతారు. కానీ, ఇందులో నిజం లేదు.మీరు సరైన విధంగా, చపాతీలు తింటే బరువు తగ్గుతారనేది నిజం. నిపుణుల ప్రకారం.. సరైన విధంగా చపాతీలు చేసుకుని మితంగా తీసుకుంటే కచ్చితంగా బరువు తగ్గుతారు. మరి అదెలానో తెలుసుకోండి.



### అచ్చమైన గోధుమపిండి..



చపాతీలు చేయడానికి చాలా మంది మార్కెట్లో దొరికే పిండి తీసుకుంటారు. ఇది గోధుమ పిండి అని చెబుతారు. కానీ, అందులో అంతో ఇంతో కల్తీ జరగడం, మైదా కలవడం జరుగుతుంది. కాబట్టి, అలా కాకుండా మీరే గోధుమలు తీసుకుని పిండి పట్టించి ఆ గోధుమపిండినే వాడండి. దీని వల్ల ఫైబర్ ఎక్కువగా అందుతుంది. దీంతో కడుపుకి మంచి సాటిస్‌ఫాక్షన్ ఉంటుంది.

### గ్రెయిన్స్ కలపడం..



అదే విధంగా, అప్పుడప్పుడు దీనిని మల్టీ గ్రెయిన్స్‌లా పట్టించడం చేయండి. అంటే రాగులు, జొన్నలు, బజ్రా వంటివి కలిపి పట్టించడం, లేదా విడివిడిగా పట్టించి చపాతీ చేసినప్పుడు పిండి కలపడం చేయండి. దీంతో శరీరానికి ఎక్కువ పోషకాలు కూడా అందుతాయి. హ్యాపీగా తినొచ్చు.

### కూరగాయలు, ఆకుకూరలు..



చాలా మంది ఆకుకూరలు, కూరగాయలు తినరు. అలాంటచాలా మంది ఆకుకూరలు, కూరగాయలు తినరు. అలాంటప్పుడు పిండి కలిపేటప్పుడే అందులో వాటిని మిక్సీ పట్టి ఆ పేస్టు కలపడం చేయండి. ఉదాహారణకి పాలకూర, బీట్‌రూట్, క్యారెట్స్ వంటి వాటిని మిక్సీ పట్టి వేయడం వల్ల రుచిగా ఉంటాయి. పోషకాలు కూడా అందుతాయి. ఇష్టమనుకుంటే తురుములా కూడా చేయొచ్చు. దీనికి కాస్తా పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు, జీలకర్ర కలిపారంటే కూరలు లేకుండా కూడా అలా ఎంజాయ్ చేయొచ్చు. లేదంటే ఏదైనా ఒక ఆకుకూరో, కూరగాయైనా యాడ్ చేయండి. పిండి కలిపేటప్పుడు చాలా మంది నూనె వేస్తుంటారు. అయితే, ఇది ఎక్కువగా వేయొద్దు. తక్కువ పరిమాణంలోనే వేయాలి. వీలైతే నెయ్యి వేయండి. దీని వల్ల ఎక్కువ కేలరీలు వెళ్లవుప్పుడు పిండి కలిపేటప్పుడే అందులో వాటిని మిక్సీ పట్టి ఆ పేస్టు కలపడం చేయండి. ఉదాహారణకి పాలకూర, బీట్‌రూట్, క్యారెట్స్ వంటి వాటిని మిక్సీ పట్టి వేయడం వల్ల రుచిగా ఉంటాయి. పోషకాలు కూడా అందుతాయి. ఇష్టమనుకుంటే తురుములా కూడా చేయొచ్చు. దీనికి కాస్తా పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు, జీలకర్ర కలిపారంటే కూరలు లేకుండా కూడా అలా ఎంజాయ్ చేయొచ్చు. లేదంటే ఏదైనా ఒక ఆకుకూరో, కూరగాయైనా యాడ్ చేయండి. పిండి కలిపేటప్పుడు చాలా మంది నూనె వేస్తుంటారు. అయితే, ఇది ఎక్కువగా వేయొద్దు. తక్కువ పరిమాణంలోనే వేయాలి. వీలైతే నెయ్యి వేయండి. దీని వల్ల ఎక్కువ కేలరీలు వెళ్లవు

### కాల్చేటప్పుడు..



అయితే, వీటిని కాల్చేటప్పుడు కూడా ఎక్కువగా నూనె వేయకండి. వీలైతే నాన్‌స్టిక్ పాన్ వాడండి. దీంతో మీకు ఎక్కువగా కేలరీలు వెళ్లవు. తక్కువ నూనెతోనే కాల్చండి. నాన్‌స్టిక్ పాన్ మాత్రమే కాకుండా ఐరన్ పాన్‌పై కూడా కాల్చొచ్చు. అయితే, దేనిపై కాల్చినా నూనె, నెయ్యి తగ్గించి వాడడం మంచిదని గుర్తుపెట్టుకోండి.

### తక్కువ పరిమాణంలోనే..



అయితే, ఎంత హెల్దీగా చేసినా కూడా వీటిని మితంగా తినడం ముఖ్యం. హెల్దీ అని ఎక్కువ పరిమాణంలో తింటే సమస్యలు తప్పవు. కాబట్టి, తక్కువ పరిమాణంలో తీసుకోండి. ఒకటి, రెండు చపాతీలు చాలు. అంతకు మించి ఎక్కువగా తీసుకోవద్దు. కడుపు నిండుగా అనిపించక ముందే తినడం ఆపేయాలి.

### బెనిఫిట్స్..



ఇలా చేసిన చపాతీలు తింటే ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో కేలరీలు తక్కువగా తింటాం. కడుపు నిండుగా ఉంటుంది. ఎక్కువగా తినం. దీంతో బరువు తగ్గుతారు. అదే విధంగా, ఇందులోని ఫైబర్ కంటెంట్ షుగర్‌ని మెల్లిగా అబ్జార్బ్ చేసుకుంటుంది. దీంతో బ్లడ్ షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పెరగవు.జీర్ణ సమస్యలు..మనం హోల్ గ్రెయిన్స్ కలిపినప్పుడు జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఫైబర్ చక్కగా అందుతుంది. పోషకాలు..మనం అచ్చంగా గోధుమపిండిని తీసుకుంటే అందులో విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. ఐరన్, మెగ్నీషియం, బి విటమిన్స్ ఎక్కువగా అందుతాయి. దీంతో బాడీకి సరిపడా పోషకాలు తీసుకున్నవారవుతాం. అదే విధంగా, చపాతీల్లో ఎక్కువగా ఐరన్ స్థాయిలు ఉంటాయి. ఇవి బాడీలో హిమోగ్లోబిన్ లెవల్స్‌ని బ్యాలెన్స్ చేసి రక్తహీనత లేకుండా చేసాయి. దీంతోపాటు ఇందులో సెలీనియం ఉంటుంది. దీంతో క్యాన్సర్ కారకాలు శరీరంపై దాడిచేయకుండా ఉంటాయి. ఇందులో తక్కువ కొలెస్ట్రాల్ ఉంటుంది. కాబట్టి, గుండె ఆరోగ్యానికి చాలా మంచిది.గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.